పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి

మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్


మేడ్చల్‌లో పలు పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మేడ్చల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఇతర పార్టీల నాయకుల ఇళ్లకు వెళ్లి మద్దతు కూడగడుతున్నారు. మేడ్చల్ పట్టణంలో ఆయన పర్యటించి నాయకుల మద్దతు కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన మేడ్చల్ మాజీ సర్పంచ్‌లు సీనియర్ లీడర్లు చీదు దేవేందర్‌రెడ్డి, మురళీధర్‌గుప్తా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ ఇళ్లతో పాటు ముస్లిం మత పెద్ద జాఫర్ కుటుంబసభ్యుల ఇళ్లకు ఆయన వెళ్లి వారితో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతుగా ఉండాలని, ఏమాత్రం అవకాశమున్నా బీజేపీలో చేరాలని ఆయన వారిని కోరారు. పార్టీ మారలేని వారు ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని, తనకు అండగా నిలిచే వారికి తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. బీఆర్ఎస్ మండల నాయకులు జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి, మండల కో ఆర్డినేటర్ బలరాంరెడ్డి, పూడూర్ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, బీజేపీ నాయకులు జగన్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు..

ఐడీఎస్‌తో సెయింట్ పీటర్స్ కళాశాల ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సెయింట్ పీటర్స్-ఐడీఎస్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల గురువారం బహుళ జాతి సంస్థ అయిన ఇన్ఫర్మేషన్ అండ్ సిస్టమ్స్(ఐడీఎస్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరి టీవి రెడ్డి, ఐడీఎస్ బిజినెస్ స్ట్రాటజీ హెడ్ సునీల్ సుబ్రహ్మణ్యం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఎంఓయూతో ఎమర్జింగ్ టెక్నాలజీస్ అయిన బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ విభాగాల్లో విద్యార్థుల నైపుణ్యం పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని సెక్రటరి టీవి రెడ్డి, టీపీఓ శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, హెనోటిక్ సొల్యూషన్స్ ఫౌండర్ మల్లేశం, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న రంగంపై శ్రద్ధ కనబర్చాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్‌లో జాతీయ స్థాయిలో రెండు రోజుల పాటు అక్షర 2కె 24ను గురువారం క్లౌడ్ ఫర్ సీ సంస్థ ఉపాధ్యక్షుడు సుధీంద్ర కులకర్ణి, అమెజాన్ సంస్థ హ్యూమన్ రిసోర్స్ అధికారి అనిల్, కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు తాము ఏ రంగంలో మెరుగ్గా ఉన్నామో గుర్తించి ఆ రంగంపై శ్రద్ధాసక్తులు కలిగి ఉండాలన్నారు. సమాజానికి ఏ విధంగా సహాయకరంగా నిలబడగలమో నిర్ణయించుకోవాలన్నారు. ఆర్థిక మాంద్యం వంటి విషయాలను పక్కన పెట్టి మంచి ఉపాధి అవకాశాన్ని సాధించే లక్ష్యంపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. రెండు రోజుల పాటు సాంకేతిక సాంస్కృతిక సంబురంలో విద్యార్థులకు కోడింగ్ పోటీలు, హ్యాకథాన్, మిస్టర్ అండ్ మిస్ అక్షర వంటి పలు పోటీలను నిర్వహిస్తామని, వివిధ కళాశాలలకు చెందిన 10 వేల మంది విద్యార్థులు పాల్గొనున్నారని వివరించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు పిళ్లా శ్రీనివాస్, శివప్రసాద్, మోహన్‌శ్రీనివాస్, వసంత్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.


మల్లారెడ్డి యూనివర్సిటీలో ది డిప్లొమెటిక్ క్లబ్ ప్రారంభం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో గురువారం ది డిప్లొమెటిక్ క్లబ్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, అంబాసిడర్ దీపక్ వోహర, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, క్లబ్ అధ్యక్షులు మూర్తి దేవరబొట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు గ్లోబల్ సిటిజన్‌షిప్, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు క్లబ్ ఎంతగానో దోహదపడుతుందని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు అన్ని విధాలా ఉన్నతంగా నిలిపేందుకు మల్లారెడ్డి యూనివర్సిటీ కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. యూనివర్సిటీ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆంజనేయులు, డీన్ రవిందర్, కార్పొరేట్ రిలేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్‌కుమార్, డిప్లొమెటిక్ క్లబ్ సెక్రటరి జనరల్ తస్నీమ్ షరీఫ్, అషిమా, ఉషా, డీన్ హరికృష్ణ, ధనుమ్జా చారి, కైలాష్‌రావు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


పక్షుల కోసం మట్టి పాత్రలను సిద్ధం చేసిన టీఎస్‌ఎఫ్‌డీసీ అధికారులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పక్షుల దాహం తీరేలా..



గచ్చిబౌలి: వేసవిలో పక్షుల కోసం బొటానికల్ గార్డెన్‌లో నీటి పాత్రలను ఏర్పాటు చేశారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ మట్టి పాత్రలను అందజేశారు. దాదాపు 200 పాత్రలను గార్డెన్‌లో పలు ప్రాంతాలలో అమర్చారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, జీఎం డాక్టర్ సైకిలాబ్ , రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, బొటానిస్ట్ డాక్టర్ వీర కిశోర్, బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు భరత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ప్రభుత్వ సాయం


ముస్తాక్ అహ్మద్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ 17వ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐఎస్‌కాలనీకి చెందిన షేక్ ముస్తాక్ అహ్మద్ కుమారుడు మాస్టర్ మాజూల్ సయ్యద్ కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా ఆయనకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.80వేలు చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. తన సమస్యలపై మాజూలు సయ్యద్ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, తోటకూర అజయ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వర గుప్త, మేకల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.


జవహర్‌నగర్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కబ్జాదారులపై క్రిమినల్ కేసులే..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూములు సర్వే నంబర్-420, 426, 606లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని అన్నారు. అక్రమ లేఅవుట్‌లు చేస్తూ అమాయక ప్రజలకు విక్రయిస్తున్న కబ్జాదారులను వదిలేది లేదన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి 60 శాతం విత్తనాలు
తెలంగాణ నుంచే..

- వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు
- నూతన్‌కల్‌లో సీడ్ హెల్త్ ల్యాబ్ ప్రారంభం


నూతన్‌కల్ సింజెంటా కంపెనీలో ల్యాబ్ ప్రారంభిస్తున్న రఘునందన్‌రావు, ఇతర అధికారులు

మేడ్చల్: దేశంలోని రైతులకు కావాల్సిన విత్తనాల్లో 60శాతం రాష్ట్రం అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో సింజెంటా విత్తన కంపెనీ ఏర్పాటు చేసిన సీడ్ హెల్త్ ల్యాబ్‌ను ఆయన వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, కేంద్ర వ్యవసాయశాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ డీకే శ్రీవాస్తవతో కలిసి ప్రారంభించారు. రాష్ట్రంలో ఉన్న విత్తన కంపెనీల నుంచి దేశానికి అవసరమైన విత్తనాల్లో 60 శాతం విత్తనాలు ఎగుమతి అవుతున్నాయన్నారు. రాష్ట్రంలో విత్తన కంపెనీల ఏర్పాటు, నూతనంగా ఏర్పాటు చేస్తున్న వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహకారం అందిస్తున్నామన్నారు. సాగుదారులకు అత్యంత నాణ్యత ఉన్న విత్తనాలు అందించే విధంగా పనిచేయాలని అన్నారు.

నూతన వంగడాలు, రోగాలు సోకకుండా కంపెనీ నూతన ఉత్పత్తులు చేసేందుకు ఏర్పాటు చేసిన సీడ్ హెల్త్ ల్యాబ్ ఏర్పాటు చేసి పరిశోధనలు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ రూ.20 కోట్లతో ల్యాబ్ నిర్మించామని పంటలకు సోకే 12వేల వైరస్‌లను ప్రాసెస్ చేయగల సామర్థ్యాన్ని ల్యాబ్ కలిగి ఉందని తెలిపారు. సింజెంటా 150 సంవత్సరాల క్రితం ప్రారంభమై నేడు 60దేశాల్లో సేవలందిస్తోందని, 124 దేశాలకు విత్తనాలను సరఫరా చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు నిషింత్ భాటియా, ఎరిక్‌పోస్టమా తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో సత్తాచాటిన సీఎంఆర్


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ, ప్రిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాల విద్యార్థులు సీనియర్ నేషనల్ త్రో బాల్ పోటీల్లో సత్తాచాటారు. ఇటీవల బీహార్ రాష్ట్రంలో నిర్వహించిన సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థినుల జట్టు మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ మేరకు గురువారం కళాశాల సెక్రెటరీ శ్రీశైలంరెడ్డి, వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కేఎస్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్‌గౌడ్ విద్యార్థినులను అభినందించారు.

పార్కింగ్ చేసిన లారీల్లో డీజిల్ చోరీ

మేడ్చల్‌రూరల్: పార్క్ చేసిన లారీల్లో దుండగులు డీజిల్ దొంగతనానికి పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలో హోండా షోరూం సమీపంలో బుధవారం రాత్రి 8 లారీలు పార్కింగ్ చేసి నిద్రించారు. అర్ధరాత్రి దొంగలు పార్క్ చేసి ఉన్న మూడు లారీల డీజిల్ ట్యాంక్ మూతలు, తాళాలను తొలగించి వాటిలోని సుమారు 150 లీటర్ల డీజిల్ దొంగిలించారు. బాధిత లారీ డ్రైవర్ల ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంని కలిసిన జలగం వెంకటేశ్



కాప్రా: మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ జలగం వెంకటేశ్ గురువారం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యలు పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట అంజయ్య, శ్రీనివాస్, ఉదయ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన అంజయ్య ..

కాప్రా: సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలెపాక అంజయ్య కలిశారు. పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరైన సీఎం రేవంత్‌ను ఆయన కలిసిన శుభాకాంక్షలు తెలిపారు.

పీటీసీలో ప్రపంచ నీటి దినోత్సవం


నీటి ప్రాధాన్యత వివరిస్తున్న ప్రొఫెసర్ రాజ్‌కుమార్


హాజరైన ట్రైనీ కానిస్టేబుళ్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని పోలీస్ శిక్షణ కేంద్రం(పీటీసీ)లో గురువారం ప్రపంచ నీటి దినోత్సం నిర్వహించారు. యునైటెడ్ నేషన్స్ ఆధ్వర్యంలో శాంతి కోసం నీరు అనే అంశంపై ప్రొఫెసర్ రాజ్‌కుమార్ పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్స్‌కు అవగాహన కల్పించారు. నీటి వినియోగం, లభ్యత, నీటి ప్రాధాన్యం, సంరక్షణ విధానాలపై వివరించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్, డీసీపీ మధుకర్ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, ప్రొఫెసర్ లక్ష్మికుమారి సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలిపై కోడలి చిత్రహింసలు

కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు


ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న విమలాదేవి

ఉప్పల్: కోడలు పెట్టే బాధలు భరించలేక.. కొడుకుకు విషయం చెప్పినా ఫలితం లేకపోవడంతో ఓ వృద్ధురాలు హ్యూమన్ రైట్స్ ప్రతినిధులకు ఫోన్ ద్వారా గోడు వెళ్లబుచ్చుకుంది. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు.. ఉప్పల్ పద్మావతి కాలనీలో నివాసముండే ఆదిరాజు విమలాదేవి(80)కి కుమారుడు సుబ్రహ్మణ్యం, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె భర్త అయ్యప్పశాస్త్రి 13 సంవత్సరాల క్రితం మృతి చెందారు. విమలాదేవి గతంలో మ్యూజిక్ డైరెక్టర్‌గా కూడా పని చేశారు. భర్త చనిపోయిన తర్వాత కోడలు తరచూ ఇబ్బందులు పెట్టేదని, తిట్టడంతో పాటు కొట్టేదని విమలాదేవి చెప్పారు. సమయానికి భోజనం కూడా పెట్టేది కాదని ఆవేదన చెందింది. ఇవన్నీ తెలిసినా కొడుకు తన భార్యని ఏమీ అనేవాడు కాదని విమలాదేవి తెలిపారు. ఇల్లు తన భర్త పేరు మీదే ఉందని, తాను బ్యాంకులో దాచుకున్న రూ.15 లక్షలకు సంబంధించిన పాసుబుక్ కూడా సుబ్రహ్మణ్యం తీసుకున్నాడని చెప్పారు. అంతేకాకుండా పింఛన్ డబ్బులు సైతం కాజేస్తున్నాడన్నారు. తనకు విముక్తి కల్పించి.. తనను మరోచోటకు తరలించాలని బాధితురాలు హ్యూమన్ రైట్స్ ప్రతినిధులను వేడుకుంది. దీంతో రంగంలోకి దిగిన ప్రతినిధులు.. ఉప్పల్ పోలీసుల సహాయంతో వృద్ధురాలిని కలుసుకున్నారు. ఈక్రమంలో పోలీసులు సుబ్రహ్మణ్యం, తన భార్యపై కేసు నమోదు చేశారు.

వృద్ధులను వేధిస్తే సహించేది లేదు..

వృద్ధులను వేధించినా, వారి ఆస్తి లాక్కునా సహించబోమని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి హెచ్చరించారు. విమలాదేవి విషయం ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు విన్నవించామని, ఆమె కుమారుడు, కోడలిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. భర్త పేరు మీద ఉన్న ఆస్తిని విమలాదేవి పేరు మీదకు మార్చేలా కృషి చేస్తామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం కోసం వినతి


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న అల్వాల్‌హిల్స్ కాలనీవాసులు

అల్వాల్: అల్వాల్‌హిల్స్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం కాలనీవాసులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, జలమండలి జీఎం, డీజీఎంకు వినతిపత్రం ఇచ్చా రు. కాలనీలో ప్రెషర్‌తో నీళ్లు వస్తున్నాయని, సిబ్బంది సరఫరా వేళలు పాటించడం లేదన్నారు. అల్వాల్‌హిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రావు, సభ్యులు నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, రాజా రెడ్డి, రాకేశ్, భాస్కర్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల ఇబ్రహీంపట్నం మహిళా డిగ్రీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరానికి బీఏ ఆర్ట్స్ విభాగంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాధిక తెలిపారు. ఏప్రిల్ 12లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్మీడియట్ పాస్ అయిన వారు, 2024 సంత్సరానికి పరీక్ష రాసిన వారు కూడా అర్హులన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవం


మల్లికార్జున స్వామి ఆలయం వద్ద అన్నదానం

ఘట్‌కేసర్: ప్రతాపసింగారంలోని మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే దంపతులు సుధీర్‌రెడ్డి, చంద్రకళ, నిర్వాహకులు నర్సింహ, ఎల్లయ్య, అంజయ్య, రవి, చంద్రయ్య, నాయకులు బద్దం కుమార్, చంద్రశేఖర్, ప్రభాకర్‌గౌడ్, జంగయ్యయాదవ్, బాలకృష్ణ, వెంకటేశ్‌యాదవ్, మహంకాళి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అనురాగ్ యూనివర్సిటీలో స్టూడెంట్ ఫోరం ప్రారంభం


సదస్సు ప్రారంభిస్తున్న ముఖ్య అతిథి ఈఆర్ నులి

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలాక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) స్టూడెంట్ ఫోరంను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఐఈటీఈ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ ఈఆర్ నులి నమఃశ్శివాయ, కార్యదర్శి కే.సంగంకర్, కోశాధికారి శ్రీనివాస్, ఇంజినీరింగ్ డీన్ విజయ్‌కుమార్, ప్రొఫెసర్ మంగళగౌరీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్‌లో విద్యార్థుల జ్ఞానం, నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఐఈటీఈ తోడ్పడుతుందని అన్నారు. నూతన ఆవిష్కరణలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిస్తుందని, భవిషత్‌లో విద్యార్థుల సృజనాత్మకత, చాతుర్యాన్ని ప్రదర్శించడానికి వేదిక అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏయూ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పకుండా తీసుకోవాలి


శామీర్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో..

శామీర్‌పేట్: పోషకాలు కలిగిన ఆహారాన్ని తినాలని డీడబ్ల్యూఓ కృష్ణారెడ్డి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం శామీర్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మ, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలతో మోకాళ్ల నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 132 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే 33 మందిని హాస్పిటల్‌కు తరలించి ఉచితంగా ఆపరేషన్ నిర్వహించామని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు ఓమార్, అభిషేక్, వైభవి, దివ్య, సమ్రాన్, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, నాగార్జున పాల్గొన్నారు.

రేపటి నుంచి సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

రామంతాపూర్: ఈ నెల 23వ తేదీ నుంచి 27 వరకు స్థానిక రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం ఆలయ చైర్మన్ కోట్ల నరసింహారెడ్డి, ఈఓ సత్య చంద్రారెడ్డి మాట్లాడుతూ.. వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రంగురంగుల విద్యుత్తు దీపాలతో ఆలయాన్ని అలంకరించామని చెప్పారు. అంతేకాకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. 23వ తేదీన అంకుర్పాణ, 24న మహా కుంభస్థాపన, ధ్వజారోహణం, 25న సత్యదేవుని తిరుకల్యాణం, 26న స్వామివారి గజవాహన రథోత్సవం, 27న దేవత విసర్జన, డోలోత్సవం తదితర ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

దివ్యాంగుల మధ్య పుట్టినరోజు వేడుకలు

కాప్రా: ఏఎస్‌రావునగర్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి కుమార్తె కశ్యాపి రెడ్డి తన పుట్టిన రోజు వేడుకలను దివ్యాంగులతో కలిసి జరుపుకున్నారు. సాధన మానసిక వికలాంగుల స్కూల్‌లోని దాదాపు 150 మంది విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేసి, కేక్ కట్ చేశారు. తన పుట్టిన రోజు వేడుకలు ఇలా జరుపుకోవడం సంతోషకరమని లయన్స్ క్లబ్ ఆఫ్ కమలానగర్ ప్రతినిధులు అన్నారు. కార్యక్రమంలో పావనీరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సురేఖ రెడ్డి, నాగన్న, సురేశ్, రాజేంద్రప్రసాద్, వంజరి ప్రవీణ్‌కుమార్, రవికుమార్, నాగేశ్వర్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, రజిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పూర్వ విద్యార్థికి సన్మానం

కాప్రా: భారత రక్షణ దళంలో ఉద్యోగం సాధించిన కాప్రా సర్కిల్‌కు చెందిన ఏవీ సాయి రోహిత్‌ను గురువారం విజయ స్కూల్ యాజమాన్యం సన్మానించింది. తమ స్కూల్‌లో చదివి ఉన్నత స్థాయికి చేరిన రోహిత్‌ను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రాజేశ్వర్‌రావు, డైరెక్టర్ వీణ, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.